సూరజ్ బాన్ ఆసుపత్రి.. వైద్యులు లేక ఇబ్బంది


ఓపీలో క్యూ కట్టిన రోగులు


శాలిబండలోని ఆసుపత్రి భవనం

47 ఏళ్లుగా నిరంతర వైద్య సేవలందిస్తున్న ఆసుపత్రి

- వైద్యుల కొరతతో అరకొర సేవలు
- ఆగస్టు 16న, 48వ వసంతంలోకి..
- వందేళ్ల వరకు ఉచితంగా భవనం లీజ్

చార్మినార్: పాతబస్తీలో చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఏకైక ఆసుపత్రి శాలిబండలోని ప్రభుత్వ సూరజ్ బాన్ భగవతి భాయి మెటర్నిటీ అండ్ చిల్డ్రన్స్ ఆసుపత్రి. బేలా హాస్పిటల్ పేరుతో ప్రాచుర్యంలో ఉంది. 47 ఏళ్ల క్రితం పాతబస్తీ ప్రజలకు అందుబాటులోకి వచ్చిన ఈ ఆసుపత్రి గోల్డెన్ జూబ్లీ వైపు వెళుతోంది. ఆధునిక హంగులతో కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా ఇక్కడ వైద్య సేవలు అందుతున్నాయని రోగులు అంటున్నారు. అయితే వైద్యుల కొరత అధికంగా ఉంది. 50 పడకల ఆసుపత్రి అయినా ఇక్కడ ప్రతిరోజు అవుట్ పేషంట్ విభాగంలో 150 వరకు చిన్నారులు వైద్య సేవల కోసం వస్తుండగా.. వారానికి మూడు రోజులు నిర్వహించే ఓపీలో 150–250 వరకు గర్భిణీ రోగులు వైద్య సేవలు పొందుతున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జరిగే ఓపీలో వైద్య సిబ్బంది కొరత కారణంగా ఆలస్యమవుతోందని రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 50 పడకల ఆసుపత్రి అయినప్పటికీ.. అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి తప్పనిసరిగా వైద్య సేవలను అందజేస్తున్నామని సంబంధిత వైద్యులు చెబుతున్నారు.

వైద్యుల కొరత.. అందుబాటులో లేని బ్లడ్ బ్యాంక్..

నిరంతరం వైద్య సేవలను అందజేస్తున్న ఈ ఆసుపత్రిలో వైద్యుల కొరత ఎక్కువగా ఉంది. నాలుగేళ్లుగా ఒకే చోట విధినిర్వహణ కొనసాగిస్తున్న వైద్యులను బదిలి చేయడంతో వారి స్థానంలో ఇంకా కొత్తగా వైద్యులను ఏర్పాటు చేయలేదు. దీంతో అటు రోగులతో పాటు విధినిర్వహణలోని వైద్యులకు ఇబ్బందులు తప్పడం లేదు. 15 మంది వైద్య సిబ్బంది ఉండాల్సిన ఇక్కడ ప్రస్తుతం 9 మంది వైద్యులు మాత్రమే ఉన్నారు. ఇందులో గైనిక్, అనస్థీయా, చిల్డ్రన్స్ విభాగాల్లో ముగ్గురు చొప్పున వైద్యులు ప్రస్తుతం వైద్య సేవలను అందజేస్తున్నారు. నర్సింగ్ విభాగంలో 30 మంది ఉండాల్సి ఉండగా.. 29 మంది ఉన్నారని సంబంధిత వైద్యులు తెలిపారు. ఇక గర్భిణులకు శస్త్ర చికిత్సలు నిర్వహించడానికి ఇక్కడి ఆసుపత్రిలో బ్లడ్ బ్యాంక్ అందుబాటులో లేదు. దీంతో అత్యవసర సమయాల్లో క్రిటికల్‌గా ఉండే పేషంట్స్‌ను దగ్గర్లోని పేట్ల బురుజు ఆధునిక ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారు.

1977 ఆగస్టు 15న అందుబాటులోకి..

సూరజ్ భాన్ భగవతి భాయి కుటుంబ సభ్యులు శాలిబండలో మెటర్నిటీ అండ్ చిల్డ్రన్స్ ఆసుపత్రి కోసం తమ భవనాన్ని 100 ఏళ్ల కోసం ఉచితంగా లీజుకు అందజేసింది. 1977 ఆగస్టు 15న అప్పటి ఆరోగ్య శాఖ మంత్రి రాజమల్లు ఈ ఆసుపత్రిని ప్రారంభించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు పాతబస్తీ ప్రజలకు నిరంతరం వైద్య సేవలు అందుతున్నాయి. ఈ ఆగస్టు 16న 48వ వసంతంలోకి అడుగు పెడుతోంది.

డాక్టర్లు బాగా చూస్తారిక్కడ


ఈ ఆసుపత్రిలో రోగులు మంచిగా చూస్తారు. అవసరమైన మందులు ఇస్తారు. నేను నెలనెలా చూపించుకుంటున్నా. నేను స్థానికంగా ఉండడంతో చాలా సౌకర్యంగా ఉంది. అయితే ఒక్కొక్కసారి రోగులు ఎక్కువగా ఉంటుండడంతో చాలా సమయం పడుతుంది.

– చంద్రకళ, బేలా

నిరంతరం వైద్య సేవలు


నేను గత నెల 31న ఇక్కడి ఆసుపత్రికి సూపరింటెండెంట్‌గా నియమితులయ్యాను. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేను ఇక్కడే చిల్డ్రన్స్ స్పెషలిస్టుగా వైద్య సేవలను కొనసాగిస్తున్నా. లాంగ్ స్టాండ్ వైద్యులను బదిలీ చేయడంతో ప్రస్తుతం వైద్యుల సంఖ్య తక్కువగా ఉంది. అయినప్పటికీ ఎక్కడ ఎలాంటి అసౌకర్యాలు లేకుండా నిరంతర వైద్య సేవలను కొనసాగిస్తున్నాం.

– డాక్టర్ లక్ష్మీనారాయణ, సూపరింటెండెంట్

అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి


పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో వేగం పెంచి వాటిని త్వరలో పూర్తి చేయాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన టోలిచౌకీ, ఎండీలైన్స్ తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టోలిచౌకీ చౌరస్తా, టోలిచౌకీ నుంచి మోతీదర్వాజ వెళ్లే మార్గంలో జరుగుతున్న పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. టోలిచౌకీ చౌరస్తాలో జరుగుతున్న అభివృద్ధి పనుల వల్ల ట్రాఫిక్ పూర్తిగా అస్తవ్యస్తంగా మారిందన్నారు. కార్పొరేటర్ నసీరుద్దీన్, బల్దియా డీఎంసీ శశిరేఖ తదితరులున్నారు.

కామర్స్, మేనేజ్‌మెంట్ విద్యార్థులకు ఉపాధి అవకాశాలు


బహుమతులతో కామర్స్ విద్యార్థులు

చార్మినార్: కామర్స్, మేనేజ్‌మెంట్ కోర్సులు చేసిన విద్యార్థులకు అనేక ఉపాధి, ఉద్యోగ అవకాశాలున్నాయని ప్రభుత్వ సిటీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య బాల భాస్కర్ అన్నారు. ప్రభుత్వ సిటీ కళాశాల కామర్స్ విభాగం విద్యార్థులలో ఉన్న ప్రతిభను గుర్తించటానికి ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు 'కామర్స్ వారోత్సవాలు' పేరిట ప్రత్యేక కార్యక్రమాలు, వివిధ విభాగాలలో పోటీలు జరిగాయి. శుక్రవారం జరిగిన ముగింపు వేడుకల్లో ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గత దశాబ్ద కాలంగా కామర్స్ అనుబంధ కోర్సులలో విద్యార్థుల చేరిక గణనీయంగా పెరిగిందన్నారు. ముగింపు వారోత్సవాల్లో భాగంగా వివిధ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లోని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విప్లవదత్ శుక్లా, కో ఆర్డినేటర్ డా.నీరజ, విభాగాధిపతి డా. మల్లికార్జునరావు, డా. ఝాన్సీ రాణి, ఇఫత్ ఉన్నీసా, డా. రవీంద్రబాబు, డా.శిరీష, లలిత చైతన్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆదివాసీల దినోత్సవం

గోల్కొండ: ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలు శుక్రవారం గాంధీభవన్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి టీపీసీసీ అధ్యక్షుడు జగ్గారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఎరుకుల సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కురాకుల కృష్ణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఏకలవ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎరుకుల రాష్ట్ర సంఘం నాయకుడు బి.సత్యనారాయణ, సాంబయ్య, శివకుమార్, రమేష్, సామయ్య, వరలక్ష్మి, వందన, విజయ తదితరులున్నారు.


వేడుకల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రజలు సుభిక్షం


దానం నాగేందర్‌ను సత్కరిస్తున్న వాసు ముదిరాజ్, సుభాష్

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలో తెలంగాణ ప్రజలు ఎంతో సంతోషంగా, సుభిక్షంగా ఉంటున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. గోషామహల్ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ నాయకులు వాసు ముదిరాజ్, సుభాష్ ఆయనను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం నాగేందర్ మాట్లాడుతూ..సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ హయాంలో ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

అవయవదానంతో ఇతరుల ప్రాణాలు నిలబెట్టాలి


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ విజ్జులత

సుల్తాన్‌బజార్: ప్రతి ఒక్కరూ అవయవదానం చేయడం ద్వారా ఇతరుల ప్రాణాలను నిలబెట్టినవారవుతారని తెలంగాణ మహిళా విశ్వవిద్యాలయం వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ విజ్జులత పేర్కొన్నారు. ఆల్ ఇండియా బాడీ ఆర్గన్ డోనర్స్ అసోసియేషన్, సావిత్రిబాయి పూలే ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అవయవదాన అవగాహన కార్యక్రమాల బ్రోచర్‌ను శుక్రవారం కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయం ఆవరణలోని ఎప్రా హాల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ విజ్జులత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి 18 మందికి అవయవదానం చేయవచ్చని ఆమె అన్నారు. సంస్థ చైర్‌పర్సన్ డాక్టర్ జి.సీతామహాలక్ష్మి మాట్లాడుతూ.. అవయవదాత అంత్యక్రియలు ప్రభుత్వం అధికార లాంఛనాలతో నిర్వహించాలని ఆమె కోరారు. జాతీయ పర్వదినాల రోజున ఆ కుటుంబాలకు ఆయా జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా ఘన సత్కారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్.విజయ్‌కుమార్, డాక్టర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పంపిణీ



దూద్‌బౌలి: 'స్వచ్ఛదనం–పచ్చదనం'లో భాగంగా 5వ రోజు వనమహోత్సవాన్ని దూద్‌బౌలి చౌరస్తాలో బహదూర్‌పురా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేష్ కుమార్, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ పుష్పా ఠాకూర్‌తో కలిసి స్థానికులకు మొక్కలు అందజేశారు. రాజేష్ కుమార్ మాట్లాడుతూ.. పర్యావరణాన్ని కాపాడడానికి వనమహోత్సవం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మున్సిపల్ అధికారులతో పాటు దూద్‌బౌలి డివిజన్ అధ్యక్షుడు భాను చందర్ యాదవ్, అబేద్ అలీ, శ్రీకాంత్, యూత్ కాంగ్రెస్ నాయకులు జ్యోతి శెట్టి, అంబికా, సుమన్, రాజు, సంతోష్, పాల్గొన్నారు.

ఆలంల వద్ద ప్రార్థనలు

గోల్కొండ: భక్తులతో ఆలంలు కొలువుదీరిన ఆషూర్‌ఖానాలు కిటకిటలాడుతున్నాయి. ఆసీఫ్‌నగర్, మాసబ్‌ట్యాంక్, గోల్కొండ, టోలిచౌకీ తదితర ప్రాంతాల్లో ఆషూర్‌ఖానాల్లో ఆలంలకు ప్రార్థనలు నిర్వహించి భక్తులు దట్టీలు సమర్పించుకుంటున్నారు. గోల్కొండ బజాబజార్, టోలిచౌకీ చౌరస్తా వద్ద కొలువుదీరిన అలంల వద్ద సంతాప గీతాలు ఆలపిస్తున్నారు. మరోవైపు టోలిచౌకీ, మాసబ్‌ట్యాంక్ తదితర ప్రాంతాల్లో ఆలంల ఊరేగింపు నిర్వహించారు.


గోల్కొండ బడాబజార్‌లో..

భక్తిశ్రద్ధలతో నాగుల పంచమి


అబిడ్స్ పరిశ్రమల భవన్‌లో..


సంజయనగర్ నల్లపోచమ్మ ఆలయంలో..

అబిడ్స్: నాగుల పంచమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. అబిడ్స్, గోషామహల్, ధూల్‌పేట్, ఆసిఫ్‌నగర్, గుడిమల్కాపూర్ ప్రాంతాల్లో పుటల్లో భక్తులు పాలుపోసి పూజలు చేశారు. అబిడ్స్ పరిశ్రమల భవన్‌లో పెద్ద ఎత్తున వేడుకలు నిర్వహించి భక్తులకు అన్నదానం నిర్వహించారు.

సంజయనగర్‌లో..

జియాగూడ: నాగుల పంచమిని పురస్కరించుకుని జియాగూడలోని పలు ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. సంజయనగర్ నల్లపోచమ్మ ఆలయంలో నాగదేవత ఆలయం, భరత్ నగర్‌లో ఇష్టలింగేశ్వరస్వామి నాగదేవత ఆలయం, వెంకటేశ్వరనగర్‌లో గల నాగదేవత ఆలయం భక్తులతో రద్దీగా మారాయి. పెద్ద ఎత్తున భక్తులు పుట్టల్లో పాలుపోసి పూజలు నిర్వహించి తమ భక్తిని చాటుకున్నారు.

రేణుకాఎల్లమ్మ ఆలయంలో..

డబీర్‌పురా: నాగుల పంచమి సందర్భంగా నాగదేవత రేణుకాఎల్లమ్మ ఆలయంలో శుక్రవారం మహిళలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టలో పాలు, గుడ్లు పెట్టి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఏక్తా జనశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు ఎం.రాజేశ్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సంప్రదాయ బద్ధంగా తీజ్ వేడుకలు


వేడుకల్లో బంజారా మహిళలతో పాటు విద్యార్థులు, అధ్యాపక బృందం

చార్మినార్: అనాదిగా వస్తున్న మన సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విధంగా తీజ్ వేడుకలు శుక్రవారం ప్రభుత్వ సిటీ కాలేజీలో ఘనంగా జరిగాయి. శ్రావణ మాసంలో పంటలు దండిగా పండుతూ పాడి పంటలతో రాష్ట్ర ప్రజలు ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలు కలిగి ఉండాలనే కోరుతూ కాలేజీ ఆవరణలో ఈ పండుగను నిర్వహించారు. ఐఆర్‌ఎస్ అధికారి తారా సింగ్ నాయక్, ఆధ్యాత్మిక గురువు భోజ్ మహరాజ్, కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ శుక్లా, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి



గౌలిపురా: రానున్న వినాయక నవరాత్రి ఉత్సవాలు, మిలాద్–ఉన్–నబీ వేడుకలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని మొఘల్‌పురా ఇన్‌స్పెక్టర్ పి.నాగదుర్గా ప్రసాద్ సూచించారు. రానున్న ఉత్సవాలను పురస్కరించుకొని స్టేషన్ పరిధిలోని మైత్రి కమిటీ, పీస్ కమిటీ సభ్యులతో శుక్రవారం ఆయన స్టేషన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ దుర్గా ప్రసాద్ మాట్లాడుతూ..వినాయక ఉత్సవాల సందర్భంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా మండపాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎస్సై నరేశ్, ఏఎస్సై రంగ, నాయకులు పాల్గొన్నారు.

న్యాయవాదుల రక్షణ చట్టాన్ని తీసుకురావాలి

సిటీ కోర్టులు: న్యాయవాదులకు రక్షణ చట్టాన్ని తీసుకురావాలని తెలంగాణ రాష్ట్ర లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్‌లో ఫిర్యాదు చేశారు. న్యాయవాదులపై దాడులకు పాల్పడిన పోలీస్ అధికారులను వెంటనే విధులను నుంచి సస్పెండ్ చేస్తూ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్రి స్వామి మాట్లాడుతూ..పోలీసులు న్యాయవాదులపైనే దాడులకు పాల్పడుతే, సామాన్య ప్రజల పరిస్థితి ఎలా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు అశోక్, మహేశ్, ఈశ్వర్‌కుమార్, బాల్‌రాజు, శ్రీను, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

క్విట్‌ఇండియా ఉద్యమం కీలక ఘట్టం


ర్యాలీ నిర్వహించిన వనిత మహావిద్యాలయ ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ విద్యార్థులు


కార్యక్రమంలో నాయకులు ఉస్మాన్ హాజీరి, కురాకుల కృష్ణ తదితరులు


వేడుకల్లో నిర్మల్‌కుమార్ యాదవ్

గన్‌ఫౌండ్రీ: భారత స్వాతంత్య్ర ఉద్యమంలో క్విట్‌ఇండియా ఉద్యమం ఎంతో కీలక ఘట్టమని ప్రముఖ విద్యావేత్త, సరోజినీనాయుడు వనిత మహా విద్యాలయ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.శోభన దేశ్‌పాండే పేర్కొన్నారు. శుక్రవారం తెలంగాణ సిటిజన్ కౌన్సిల్, సరోజినీనాయుడు విద్యాలయ ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు ఎంజేమార్కెట్ నుంచి జాతీయ పతాకాలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శోభన దేశ్‌పాండే మాట్లాడుతూ.. యోధుల త్యాగాలతోనే దేశ స్వాతంత్య్రం లభించిందన్నారు. హైకోర్టు న్యాయవాది గద్దగూటి ఎట్టయ్య, డాక్టర్ మర్రి రాజీరెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ నాగలక్ష్మి, అంజన్‌కుమార్, ప్రముఖ యోగా గురువు రామకృష్ణశాస్త్రి, ఢిల్లీ శివకుమార్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో 'క్విట్ ఇండియా డే'

గోల్కొండ: దేశానికి స్వాతంత్రాన్ని తెచ్చిపెట్టడంతో పాటు దేశాన్ని అగ్రదేశంగా అభివృద్ధి చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని కాంగ్రెస్ కార్వాన్ ఇన్‌చార్జి ఉస్మాన్ అల్ హాజరీ అన్నారు. శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా డే జరిగింది. ఈ సందర్భంగా ఉస్మాన్ అల్ హాజరీ మాట్లాడుతూ..దేశానికి స్వాతంత్రాన్ని తేవడంలో క్విట్ ఇండియా డే ఘట్టం ఓ మహత్కర ఘట్టమన్నారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ కాంగ్రెస్ ఏ–బ్లాక్ అధ్యక్షుడు కురాకుల కృష్ణ, గుడిమల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, టీపీసీసీ ఎస్సీ సెల్ వైస్ చైర్మన్ వినోద్‌సింగ్, మక్బూల్, జి.కిషన్, గోవర్ధన్‌రెడ్డి, హబీబ్, అబ్దుల్లా, జగన్ తదితరులున్నారు.

గాంధీభవన్‌లో..

అబిడ్స్: క్విట్ ఇండియా ఉద్యమం దేశానికి స్వాతంత్య్రం రావడంలో ఎంతో ప్రధాన ఘట్టమైందని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఓబీసీ సెల్ కో ఆర్డినేటర్ నిర్మల్‌కుమార్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం గాంధీభవన్‌లో జరిగిన క్విట్ ఇండియా వేడుకల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ..ఆ నాటి త్యాగ పురుషులను గుర్తించుకోవాలన్నారు. నాటి మహనీయులు ఉద్యమంతోనే భారతదేశానికి స్వాతంత్య్రం వచ్చిందన్నారు. ఈ వేడుకల్లో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గంగారెడ్డి, నీరంజన్, బాబురావు తదితరులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


సినీనటుడు బ్రహ్మానందాన్ని సత్కరిస్తున్న నిర్వాహకులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, అజో–విభొ–కందాళం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆచార్య ఎల్చూరి మురళీధర్‌రావు రచించిన వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు పుస్తక పరిచయ సభ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా సినీ నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ..చరిత్రలో ఎన్నో విషయాలను పాఠకులకు తెలిసేలా రచయిత చేసిన ప్రయత్నం ఎంతో అభినందనీయమన్నారు. ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణతో కలిసి వేదికను పంచుకోవడం ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. ఈ కార్యక్రమంలో సుప్రసిద్ధ సాహిత్య విమర్శకులు జేఎస్‌మూర్తి, రయిత పరకాల ప్రభాకర్, సాహితీవేత్త గిరిజా మనోహరబాబు, తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య అనుమాండ్ల భూమయ్య, కిన్నెర కార్యదర్శి మద్దాలి రఘురాం పాల్గొన్నారు.

ప్రార్థనలు ప్రశాంతం



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సామూహిక ప్రార్థనల్లో ముస్లిం సోదరులతో పాటు మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాల పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పూజలు

సుల్తాన్‌బజార్: తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సతీమణి శుక్రవారం రాత్రి ఇస్సామియాబజార్‌లోని యోగానంద లక్ష్మీనరసింహాస్వామి ఆలయాన్ని సందర్శించి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సమాచారం తెలుసుకున్న సుల్తాన్‌బజార్ పోలీసులు బందోబస్తును నిర్వహించారు.



జస్టిస్ శివశంకర్ సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న వంగాల ఈశ్వరయ్య

యాకుత్‌పురా: మాజీ గవర్నర్, ఉమ్మడి హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివ శంకర్ దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఏపీ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వంగాల ఈశ్వరయ్య కొనియాడారు. హైదరాబాద్ జిల్లా సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి మాజీ గవర్నర్, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ శివ శంకర్ 95వ జయంతిని పురస్కరించుకొని సిటీ సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం పురానీహవేలీలోని కోర్టులో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. సిటి సివిల్ కోర్టు చీఫ్ జడ్జి రేణుకా యారా, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి ఆర్.తిరుపతి రెడ్డి, బార్ కౌన్సిల్ చైర్మన్ నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ కే. సునీల్ గౌడ్, శివ శంకర్ కుమారుడు డాక్టర్ వినయ్ కుమార్, కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.శ్రీనివాసాచారి, ప్రధాన కార్యదర్శి దుబ్బాక హర్షవర్ధన్, ఉపాధ్యక్షురాలు ప్రవీణా రెడ్డి, సంయుక్తా కార్యదర్శి బర్కా రాజేష్ కుమార్ పాల్గొన్నారు.

హైకోర్టు ఏజీపీగా సబావత్ జ్యోతి నాయక్



చాంద్రాయణగుట్ట: జంగమ్మెట్ డివిజన్ రవీంద్ర నాయక్‌నగర్ కాలనీకి చెందిన సబావత్ జ్యోతి నాయక్ హైకోర్టు ఏజీపీ(అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా నియమితులయ్యారు. రాష్ట్ర అడ్వకేట్ జనరల్‌చే ఉత్తర్వులు వెలువడ్డాయి. గిరిజన బిడ్డ ఏజీపీగా నియమితులు కావడంపై రవీందర్ నాయక్‌నగర్ కాలనీ బంజార వెల్ఫేర్ అధ్యక్షుడు కృష్ణా నాయక్ హర్షం వ్యక్తం చేశారు. తనకు ఇచ్చిన ఈ బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని ఆమె తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

డోర్ సమాజ్‌కు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి


ఆర్డీఓ మహిపాల్‌ను కలిసిన ఉస్మాన్‌అలీ, వినోద్ చౌగ్లే

జియాగూడ: జియాగూడలో 100 ఏళ్లుగా నివాసం ఉంటున్న వీరశైవ కక్కయ్య డోర్ సమాజ్‌కు కుల ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్‌తో నేరుగా అందజేయాలని కార్వాన్ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ అలీ, జియాగూడ ఇన్‌చార్జి వినోద్ చౌగ్లే అన్నారు. శుక్రవారం ఆర్డీఓ అధికారి మహిపాల్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే డోర్ సమాజ్‌కు ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయడంలో నిర్లక్ష్యం జరిగిందని కాంగ్రెస్ ప్రభుత్వం డోర్ సమాజ్‌కు వెంటనే ఆర్డీఓ నుంచి కాకుండా నేరుగా తహసీల్దార్ ద్వారా అందజేయాలన్నారు. దుర్గాప్రసాద్, మక్బుల్ తదితరులు పాల్గొన్నారు.

శివ సప్త నాగదేవత విగ్రహాల పునః ప్రతిష్ఠ

అఫ్జల్‌గంజ్: ఇంబ్లీబన్ పార్కులో నల్ల పోచమ్మ, శివసప్త నాగదేవత, రేణుకా ఎల్లమ్మ అమ్మవార్ల విగ్రహాల పునఃప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ లోధా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పాత నేరస్తుడికి నెల రోజుల జైలు

గౌలిపురా: స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతున్న పాత నేరస్తుడికి నెల రోజుల జైలు శిక్ష పడింది. భవానీనగర్ ఇన్‌స్పెక్టర్ ఎం.బాలస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. తలాబ్‌కట్టా రోడ్డు నంబర్–4 ప్రాంతానికి చెందిన మహ్మద్ మజ్హర్ (21) గంజాయి కేసుల్లో పాత నేరస్తుడు. కాగా మజ్హర్ స్టేషన్ పరిధిలో అనుమానాస్పదంగా తిరుగుతుండటంతో పోలీసులు అరెస్ట్ చేసి ఈ–పెట్టీ కేసు నమోదు చేసి శుక్రవారం నాంపల్లిలోని కోర్టులో హాజరు పరచగా పూర్వ పరాలను పరిశీలించిన 4వ స్పెషల్ జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ డి.సి.ఉమాపతి రావు నిందితుడికి నెల రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు.

ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ పోలీసులపై దాడి

అబిడ్స్: ధూల్‌పేట్‌లో ఎక్సైజ్ పోలీసులపై గంజాయి వ్యాపారి అనుచరులతో కలిసి దాడికి పాల్పడ్డాడు. పేరుమోసిన గంజాయి వ్యాపారి ఇంటిపై ఎక్సైజ్ పోలీసులు దాడి చేయగా వారిని అడ్డుకొని వాగ్వివాదం చేయడంతో పాటు వాహనాన్ని ధ్వంసం చేశారు. ఈ ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అప్పర్ ధూల్‌పేట్‌లో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..ఆపరేషన్ ధూల్‌పేట్‌లో భాగంగా ఎక్సైజ్ పోలీసులు ఇంటింటా తిరుగుతూ గురువారం రాత్రి అప్పర్‌ధూల్‌పేట్‌లోని బిలావర్‌గంజ్ ప్రాంతంలో గంజాయి వ్యాపారి రాహుల్‌సింగ్ ఇంట్లో తనిఖీలు చేశారు. రాహుల్‌సింగ్‌తో పాటు అతని భార్య, సోదరి, తల్లి, ఇతర మహిళలు ఎక్సైజ్ పోలీసులను అడ్డుకున్నారు. ఇరువురి మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రాహుల్‌సింగ్ ఒక అడుగు ముందుకు వేసి కోపోద్రిక్తుడై రాయితో ఎక్సైజ్ వాహనాన్ని ధ్వంసం చేశాడు. ఈ దాడిలో ఎక్సైజ్‌శాఖకు చెందిన టాటాసుమో వాహనం అద్దాలు పగిలిపోయాయి. ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మధుబాబు మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 25 రోజులుగా ఎక్సైజ్ పోలీసులు ధూల్‌పేట్‌లోని అన్ని ప్రాంతాల్లో దాడులు నిర్వహిస్తూ గంజాయిని పూర్తిగా నిర్మూలించేందుకు తనిఖీలు చేస్తున్నారు. రాహుల్‌సింగ్‌పై కేసు నమోదు చేసిన ఎక్సైజ్ పోలీసులు అతడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ దాడుల్లో కిలోకు పైగా గంజాయిని స్వాధీనపరచుకున్నారు. మంగళ్‌హాట్ పోలీసులు రాహుల్‌సింగ్‌తో పాటు మరో ముగ్గురు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని ఇన్‌స్పెక్టర్ మహేష్ తెలిపారు.


పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కార్వాన్ డివిజన్‌లోని గోల్కొండ మ్యూజియం వద్ద జీహెచ్‌ఎంసీ 'ఎగ్జోరా' గ్రూప్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. – సాక్షి సిటీబ్యూరో